ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగును విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు అన్నారు. న్యాల్‌కల్ మండలం మామిడిగి రైతు వేదికలో మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉచితంగా మొక్కల సరఫరా, మూడేళ్ల పాటు అంతర పంటల సాగు ప్రోత్సాహకానికి రూ.4200, బిందు సేద్యం పరికరాలు అందించనున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల తర్వాత పంట సేకరణ బాధ్యత ప్రభుత్వం తీసుకుని రైతులకు మద్దతు ధర అందిస్తుందన్నారు. గంగ్వార్ శివారులో ఆయిల్ పామ్ నూనె తయారీ యూనిట్ ఏర్పాటవుతుందన్నారు. సదస్సులో ఏడీఏ భిక్షపతి, బసంత్‌పూర్ ఆచార్య శాస్త్రవేత్తలు డా.విజయ్ కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికైన 1:3 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం సెయింట్ ఆంథోనీ పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు నేటి నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకోవాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఏడీ శంకర్, నోడల్ అధికారి లింబాజి తదితరులు పాల్గొన్నారు.

పండగకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త!

- ప్రజలకు పోలీసుల సూచనలు
- డయల్ 100తో సత్వర సేవలు


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్: దసరా పండగను ప్రతి ఇంటా కుటుంబసమేతంగా ఘనంగా జరుపుకొంటారు. వృత్తిరీత్యా పట్టణాల్లో ఉంటున్న వారు సైతం సొంత గ్రామాలకు వెళ్తారు. విద్యాసంస్థలకు ఈ నెల 3 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో చాలా మంది పట్టణాల నుంచి పల్లెలకు పరుగులు తీస్తుంటారు. ఇదే అదనుగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రూపేష్ మంగళవారం పలు సూచనలిచ్చారు.

ఇలా చేస్తే మేలు..

● ఇంట్లో బంగారం, నగదు బీరువాల్లో ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్ర పరుచుకోవాలి. ● ఇంటి పక్కన వారిని సైతం అప్రమత్తం చేయాలి. ● ద్విచక్ర వాహనాలు, కార్లను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. ● వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు తప్పనిసరిగా వీల్ లాక్ వేసుకోవాలి. ● ఇంటి లోపల, బయట లైట్లు వేసి ఉంచాలి. ● ఇళ్లకు సెంట్రల్ లాక్ సిస్టం, సీసీ కెమెరాలు బిగించుకోవాలి. ● సీసీ కెమెరాలను చరవాణికి అనుసంధానం చేసుకోవాలి. ● గ్యాస్ లీకేజీలు లేకుండా చూసుకోవాలి. ● విద్యుత్తు తీగలు సరిగా ఉన్నాయా లేవా అని ఒకసారి తనిఖీ చేయాలి. ● అత్యవసరంలో 100 నంబరుకు సమాచారం ఇవ్వాలి. ● పోలీసుల గస్తీకి సహకరించాలి. ● అనుమానాస్పదంగా తిరిగే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.



విరుల సిరులు.. ఆత్మీయతల సెలయేరు



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకొనే ఈ వేడుకలు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పండగ వచ్చిందంటే ఆడపిల్లలకు ఎక్కడ లేని సంబరం. ఆడపడుచుల ఆత్మీయతకు వేదికగా నిలుస్తుంది బతుకమ్మ సంబరం. నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నాలుగు జిల్లాల్లోని ప్రత్యేకతలపై కథనం.

వీడని బంధం

హుస్నాబాద్ గ్రామీణం: బతుకమ్మ వేడుకలు ఎక్కడికక్కడ చేసుకోవడం కనిపిస్తుంది. అలాంటిది ఇక్కడ మాత్రం రెండు ఊర్లు కలిసి జరుపుకోవడం విశేషం. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ తోటపల్లిలో కలిసి ఉండేది. 1995లో గాంధీనగర్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా వేరుపడింది. అయినా పాత సంప్రదాయాన్ని వీడలేదు. ఇప్పటికీ కలిసే పండగ నిర్వహించుకుంటున్నారు. 29 ఏళ్లుగా కలిసే బతుకమ్మ ఆడుతుండటం విశేషం. మిత్రులు, బంధువులు కలుసుకుంటారు.



అక్కడి వారైనా..

జిన్నారం: బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేక పండగ. అలాంటి వేడుకలను జిన్నారం పారిశ్రామిక ప్రాంతంలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు కలిసి చేసుకోవడం కనిపిస్తుంది. ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మిక కుటుంబాలు వేడుకల్లో భాగస్వాములు అవుతున్నారు. ఐడీఏ బొల్లారంలోని కేబీఆర్, వైఎస్ఆర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో ఈ వేడుక సంబరంగా కనిపిస్తుంది. నవరాత్రుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయి. ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తుంటాయి.



ఆనవాయితీగా ఇక్కడే..



మెదక్ అర్బన్: మెదక్‌లో బతుకమ్మ సంబరాలనగానే ముందుగా గుర్తుకొచ్చేది కోదండ రామాలయమే. పట్టణంలోని కాలనీలు, కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడుతారు. అనంతరం కోదండ రామాలయానికి తీసుకురావడం ఆనవాయితీ. ఇక్కడికొచ్చాకే నిమజ్జనం చేస్తారు. ఏ వీధిలో చూసినా బతుకమ్మలన్నీ చేరే వేదిక మెదక్ కోదండ రామాలయం.

సిద్దిపేటలో కోలాహలంగా..



సిద్దిపేట: సిద్దిపేటలో బతుకమ్మ వేడుకలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజులు కూడళ్లు.. నయనానందాన్ని పంచుతాయి. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత కనులపండువగా జరిగేది ఇక్కడే. వివిధ పూలతో బతుకమ్మలు పేర్చడం మొదలు.. మహిళలు ప్రత్యేక అలంకరణతో వైవిధ్యాన్ని చాటుతారు. దారులన్నీ స్థానిక కోమటిచెరువు వైపే. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవాన్ని చాటుతాయి.


60 ఏళ్లుగా..: చింతలగాట్ విజయలక్ష్మి, జహీరాబాద్



నాకు 8 ఏళ్ల వయసు ఉన్నప్పటి నుంచి బతుకమ్మ ఆడుతున్నా. ఇప్పుడు నాకు 68 ఏళ్లు. అప్పట్లో స్థానిక మాణిక్‌ప్రభు ఆలయం ముందు ఓ కట్టె మంచం వేసి దానిపై బతుకమ్మలను ఉంచి స్వాములు పూజించేవారు. ఆ తర్వాతే ఆట షురూ అయ్యేది. మంచం చుట్టూ తిరుగుతుంటుంటే పెద్దలు పాటలు పాడేవారు. కాసేపయ్యాక ఊరేగింపుగా రామ్‌మందిరానికి వెళ్లేవారం. పట్టణంలోని వారంతా అక్కడికి వచ్చి ఆడిపాడేవారు.

– న్యూస్‌టుడే, జహీరాబాద్

విశిష్టత తెలిసేలా..



పాపన్నపేట: బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో రెండో తరగతి తెలుగులో పాఠం రూపంలో పొందుపర్చారు. పూలు సేకరించినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు వివరించారు. రంగురంగుల పూలు, బతుకమ్మ పేరుద్దాం, బతుకమ్మ ఆడుదాం, బతుకమ్మలెత్తుదాం, పోయిరా గౌరమ్మ అంటూ ఐదు గేయాలను పొందుపరిచారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే హోంగార్డుకు ప్రమాదం


హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇంద్రకరణ్ ఠాణాలో పనిచేస్తున్న హోంగార్డు గోపాల్‌కు ప్రమాదం జరిగిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని మంగళవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. డిటోనేటర్లతో పేల్చిన సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే హోంగార్డుకు ప్రమాదం జరిగిందన్నారు. ఆయన వైద్యానికయ్యే ఖర్చులు భరించాలని డిమాండు చేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. బాధితుడిని ఒక్క పోలీసు అధికారి పరామర్శించలేదని ఆరోపించారు. తలకు దెబ్బ తగిలి మాట పడిపోయిందని, పూర్తిగా మాటలు రావడానికి నాలుగు నెలలపాటు స్పీచ్‌థెరపీ అందించాలని వైద్యులు చెప్పారని వివరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వేతనాలు పెండింగ్‌లో లేవు

చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌కు వేతనాలు పెండింగ్‌లో లేవని సంగారెడ్డి పోలీసు అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన రోజు ఎస్పీ రూపేష్ పరామర్శించినట్లు తెలిపారు. ఎస్పీ నిత్యం ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బాధితుడికి పోలీసు శాఖ అండగా ఉందన్నారు.

'తల్లిదండ్రులను ఇబ్బంది పెడితే జైలే..'


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, పక్కన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను నిర్లక్ష్యం వహించే పిల్లలకు జరిమానా, జైలు శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్తి పంచిన తర్వాత పిల్లలు సరిగా చూసుకోకుంటే మళ్లీ ఆస్తి పొందవచ్చన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వారి సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. నిరాదరణకు గురైన వారు ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. పలువురిని సన్మానించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి, జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి, మెప్మా పీడీ గీత, సమగ్ర శిక్ష సీఎంవో వెంకటేశం, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ అరుణబాయి, ఉపన్యాసకులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరిగాయి. ప్రిన్సిపల్ రత్న ప్రసాద్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

హోంగార్డు గోపాల్ మృతిచెందాడని ప్రచారం తగదు

ఈనాడు, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు గోపాల్ మృతిచెందాడని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలంగాణ హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఇటువంటి ప్రచారం చేయడంతో బాధిత కుటుంబం క్షోభకు గురవుతుందన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీవో జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం పాత డీఆర్‌డీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై వచ్చే ఏడాదికి పనుల గుర్తింపు పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతి కూలీకి రూ.300 నగదు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందన్నారు. అందులో జిల్లాలో రూ.250 వరకు నగదు ఇచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. గిట్టుబాటు అయ్యేలా క్షేత్ర స్థాయిలో పనులు గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు పీడీలు బాల్‌రాజ్, రాజు, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

కడ్పల్ శివారులో చిరుత సంచారం

సిర్గాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని కడ్పల్ శివారులో మంగళవారం ఉదయం చిరుత సంచరించిందని గ్రామానికి చెందిన భద్రారెడ్డి అనే రైతు తెలిపారు. శివారులోని శానూరిమామ్ దర్గా సమీపంలో పొలానికి వెళ్తుండగా చిరుత కనిపించిందన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కంప్యూటర్లు ఎందుకిచ్చారు?

8 నెలలైనా వినియోగించని వైనం


ఎమ్మార్సీ కార్యాలయంలో నిరుపయోగంగా కంప్యూటర్లు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

విద్యాశాఖలో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నమోదు, పాఠశాలల సమాచారం.. ఇలా సమస్తం అంతర్జాలంలోనే నిక్షిప్తం చేస్తున్నారు. వీటి కోసం మండల వనరుల కేంద్రాలకు 8 నెలల క్రితం కంప్యూటర్లను పంపిణీ చేశారు. వీటిని కార్యాలయంలో వినియోగించాలి. అయితే ఇందులో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయక మూలన పెట్టేశారు. దీంతో వివిధ రకాల నివేదికల తయారీలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని 18 పాత మండలాలకు(ఒక్కో మండలానికి) ఆరు కంప్యూటర్లు, ఇన్వర్టర్‌ను ఫిబ్రవరిలో పంపిణీ చేశారు. మార్చిలో విద్యుత్తు బోర్డులను ఏర్పాటు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో వీటిని వినియోగంలోకి తీసుకుకొస్తామని అధికారులు ప్రకటించినా ఇప్పటి వరకు అతీగతీ లేదు. సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల నివేదికలను కంప్యూటర్ల ద్వారానే అంతర్జాలంలో నమోదు చేయాలి. ఎమ్మార్సీ కేంద్రాల్లో ఇవి లేకపోవడంతో నివేదికలు తయారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని మండలాల్లో మాత్రమే వాడుతున్నారు.

ముందుకు సాగని పనులు

ఇప్పటి వరకు కొన్ని మండలాలకే ఎంఈవోలు ఉండడంతో పాత ఎమ్మార్సీ కార్యాలయాల నుంచే విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం 27 మండలాలకు విద్యాధికారుల నియామకం జరిగింది. వారు అక్కడే కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పాత ఎమ్మార్సీల్లో పని చేసే కొత్త మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ సమన్వయకర్తలు కొత్త వాటికి వెళ్తారు. అయితే అక్కడకంప్యూటర్లు లేకపోవడంతో పనులు ముందుకు సాగే అవకాశం ఉండదు. కార్యాలయాల్లో వృథాగా ఉన్న వాటిని వినియోగిస్తే సమయానికి అన్ని నివేదికలు అందించవచ్చు.

నివేదికలు తెప్పించుకుంటాం

ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎక్కడెక్కడ కంప్యూటర్లు వినియోగించడం లేదో పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించుకుంటాం. అందుకు గల కారణాలు తెలుసుకుంటాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం.

–వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

వేధింపులు భరించలేక సోదరుడి హత్య

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణం నాల్సాబ్‌గడ్డలో తమ్ముడే అన్నను హత్య చేశాడు. డీఎస్పీ సత్తాగౌడ్ తెలిపిన ప్రకారం.. నాల్సాబ్ గడ్డకు చెందిన షాహిద్, రఫిక్ అన్నదమ్ములు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం మత్తులో షాహిద్(43)ను రఫిక్ కత్తితో పొడిచి చంపాడు. రఫిక్, ఆయన భార్యను షాహిద్ సూటిపోటి మాటలతో వేధిస్తుండటం వల్లే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

చెరువుల వద్దకు వెళ్లొద్దు

సిర్గాపూర్: ప్రజలు దసరా సెలవులపై వచ్చిన తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఎస్సై వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించినందున, విద్యార్థులు ఈతకు చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలని, చరవాణుల నుంచి దూరంగా ఉంచాలని, మైనర్ పిల్లల చేతికి వాహనాలు ఇవ్వరాదన్నారు.

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిద్దాం'

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి పీఆర్టీయూ అభ్యర్థి విజయం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు మాణయ్య అన్నారు. పోతిరెడ్డిపల్లిలోని విద్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా నూతన కార్యవర్గాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభు, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారీకి ప్రాధాన్యం


డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న కలెక్టర్

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పోగవుతున్న వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారు చేసేలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ మేరకు మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి బస చేసిన తర్వాత మంగళవారం ఉదయం గ్రామంలో సందర్శించారు. ఎంపీడీవో యాదగిరి, ఎంపీఓ హరిశంకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి కవితతో కలిసి గ్రామంలో పర్యటించారు. డంపింగ్ యార్డ్‌లో వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రకృతి వనంలో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు.

సైబర్ బాధితులకు భరోసా

- సొమ్ము రికవరీలో జిల్లాకు మూడో స్థానం


సైబర్ నేరాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి భవానిచంద్ర

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

సైబర్ నేరాల బాధితులకు అక్కున చేర్చుకుని వారికి భరోసా కల్పించేలా పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మోసగాళ్ల చేతిలో పోగొట్టుకున్న నగదును తిరిగి బాధితులకు అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు. నిత్యం సైబర్ వారియర్‌ల ద్వారా లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నగదు రికవరీలో తాత్సారం చేయకుండా పోలీసు శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా సైబర్ సొమ్ము రికవరీలో మూడో స్థానం సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

రూ.1.91 కోట్ల రికవరీ

గత నెల 28న సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించారు. 14వ తేదీ నుంచి 28వ తేదీ లోపు సైబర్ నేరాలకు సంబంధించిన నగదు రికవరీలో పోలీసు శాఖ ప్రామాణికంగా గుర్తించింది. ఇందులో జిల్లా వ్యాప్తంగా 140 మంది బాధితులున్నట్లు తేలింది. మొత్తం రూ.1.91 కోట్లు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో మోసపోయినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఆ డబ్బు ఇప్పించేలా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయడంతో బాధితులకు ఊరట దక్కింది..

కృషి చేశారిలా....

● సైబర్ వారియర్లను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడం. ● ప్రత్యేకంగా నోడల్ అధికారులకు బాధ్యతలు అప్పగించడం. ● బ్యాంకు అధికారులతో తరుచుగా సమావేశాలు నిర్వహించడం. ● ఎస్సైలు నిత్యం సైబర్ కేసులపై అనుశీలన చేయడం. ● జూమ్ సమావేశాల ద్వారా అప్రమత్తం చేయడం. ● ప్రతి బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం.

సమష్టి కృషి వల్లే సాధ్యం: రూపేష్, ఎస్పీ

జిల్లాలోని కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, పోలీసు సిబ్బంది కృషికి ఫలితం దక్కింది. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో సైబర్ నేరాల సొమ్ము రికవరీలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం దక్కింది. ఇదే స్ఫూర్తితో పని చేస్తాం. మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. వెంటనే ఆ నగదు సైబర్ నేరగాళ్లు స్వాహా చేయకుండా కట్టడి చేస్తాం.

పక్కాగా కుటుంబ డిజిటల్ కార్డు సర్వే


సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డు సర్వే పక్కాగా నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో మంగళవారం దూర దృశ్య సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ కార్డుల జారీ కోసం ఈ నెల 3 నుంచి ప్రయోగాత్మకంగా రెండు గ్రామాలను ఎంచుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను దసరా నాటికి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 15 నుంచి ప్రతి మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, శిక్షణ కలెక్టర్ మనోజ్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, పురపాలక కమిషనర్లు పాల్గొన్నారు.

జాతిపిత.. స్ఫూర్తిప్రదాత

బాపు మాట: మహిళ అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే అసలైన స్వాతంత్య్రం.

మహిళలకు సమాన అవకాశాలు ఉండాలి. అన్నింటా రాణించాలి. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది జాతిపిత అభిమతం.

సాధికారత దిశగా..



అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు సాధికారత దిశగా పయనిస్తున్నారు. ఉన్నతమైన విద్యపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సమాజం వారికి అండగా నిలవాలి. కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. నాలుగు జిల్లాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. మెదక్‌లో 11,833, సంగారెడ్డిలో 16,477, సిద్దిపేటలో 16,773, వికారాబాద్‌లో 12,597 సంఘాలున్నాయి.

నేడు గాంధీ జయంతి

సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా యావత్ భారతావనిని ఒక్కటి చేసి స్వాతంత్య్రాన్ని తెచ్చి పెట్టారు. ఈ మాట వినగానే మన కళ్ల ముందు ఓ బక్కపల్చని శరీరం, తెల్ల ధోవతి, భుజాన కండువా గుర్తుకొస్తాయి. ఆయనే మనమంతా మహాత్మా అని పిలుచుకునే గాంధీజీ. సమష్టితత్వంతో తెల్లదొరలను తరిమికొట్టడమే కాక సమాజం మెరుగైన బాటలో నడవాలన్న సంకల్పం, పోరాట పటిమ జాతిపితకు మార్గాలు.. గాంధీయిజం అందరికీ ఓ చుక్కాని పాఠం. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్ఫూర్తితో మార్పును కాంక్షిస్తూ ప్రత్యేకత చాటుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.


– న్యూస్‌టుడే, సిద్దిపేట, జహీరాబాద్ అర్బన్, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్



బాపు మాట: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

గ్రామస్వరాజ్యం బాపూజీ కన్న కల. పల్లెలు అన్నింటా రాణిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. స్వరాజ్యం సాధనకు గ్రామస్థులు సంఘటితంగా ముందుకు సాగాలి.

ప్రణాళికాబద్ధంగా..



గాంధీజీ స్ఫూర్తిగా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామస్థులు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. దారులకు ఇరువైపులా పూల మొక్కలు నాటి సంరక్షించగా పచ్చదనం అలరిస్తోంది. ఈ-పంచాయతీ నిర్వహణ, ఇంటింటికీ తాగునీరు, తడి, పొడి చెత్త సేకరణ, జనన, మరణ, వివాహ నమోదు సహా ధ్రువపత్రాల జారీ, వీధి దీపాలు, మురుగు కాల్వలు, పచ్చదనం, పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ నిర్వహణలో ముందంజలో నిలిచింది. తద్వారా ఈఏడాది జనవరిలో ఐఎస్‌వో ధ్రువపత్రం దక్కింది.

బాపు మాట: నిన్ను నీవు కనుగొనడానికి మార్గం.. ఇతరుల సేవలో నిన్ను నీవు మరచిపోవడమే.

ఆపన్నులకు సాయం చేయడంలోనే నిన్ను నీవు తెలుసుకుంటావంటారు మహాత్ముడు. దీని స్ఫూర్తిగా ఎంతోమంది పేదలకు, ఆపన్నులకు అండగా నిలిచారు.

ఆత్మహత్యలకు చలించి..



వివరాలు సేకరిస్తున్న రాజు

మల్లన్నసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన ఏటిగడ్డకిష్టాపూర్‌కు చెందిన పులి రాజు ప్రస్తుతం వర్గల్ మండలం తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2000లో రాష్ట్రవ్యాప్తంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను చూసి చలించారు. ఇప్పటివరకు 3 వేల బాధిత కుటుంబాలకు సాయం అందించారు. దాతల సహకారంతో పిల్లల చదివిస్తున్నారు.

బాపు మాట: కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలం.


సాధన లేకుండా విజయాన్ని సొంతం చేసుకోలేం. లక్ష్య సాధనకు కఠోర శ్రమ తప్పనిసరి. ఉన్నతమైన ఆలోచనలను నిర్దేశించుకోవాలన్నది గాంధీ సూచన.

ప్రతిభ చాటేలా..



జనాభాలో గరిష్ఠ భాగం యువతదే. వారంతా చదువే లక్ష్యంగా కాకుండా క్రీడలు, వ్యాయామం, శిక్షణలపై దృష్టి సారించాలి. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చాటుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో యువత సంఖ్య 15 లక్షలకు పైనే. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో నాలుగు జిల్లాలకు చెందిన 302 మంది ప్రతిభ చాటడం విశేషం. మెదక్‌కు చెందిన యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు విపత్కర పరిస్థితుల్లో ఇతరులకు సేవ అందిస్తున్నారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.





గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా హరిత పత్రంపై కిన్నెర అంజయ్య గీసిన చిత్రాలు – న్యూస్‌టుడే, సిద్దిపేట

నాట్యం.. జనరంజకం



కోయ నృత్యం



ఎల్లమ్మ నాటక ప్రదర్శన



సిద్దిపేట విపంచి కళానిలయం వేదికపై విద్యార్థుల ప్రజ్ఞ.. ఆహూతులను అలరించింది. జానపద, శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో యువజనోత్సవాలను విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఈ సందడి మంగళవారం యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉత్తమ సేవలకు గుర్తింపు



దిల్లీ వెళ్లిన వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, కార్మికులు, స్వయం సహాయక సంఘం సభ్యులు

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు బోనగిరి లక్ష్మణ్ అందించిన ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఈ నెల 2న దిల్లీలో జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు సభలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సత్కరించనుండటం విశేషం. లక్ష్మణ్ గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆర్‌ఎంపీగా పని చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పలు కారణాలతో పంచాయతీ కార్మికుడిగా చేరారు. ఏ పనైనా నిబద్ధతతో చేయడమే ఇతడికున్న అలవాటు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు తోటి కార్మికులతో కలిసి శ్రమిస్తుంటారు. ఈయన సేవలకు పలు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవార్డులు



లక్ష్మణ్

అందించడంతో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ క్రమంలో గత నెల 17 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా ముగింపు సమావేశం బుధవారం (2న) దిల్లీలో జరుగనుంది. గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ విభాగాల్లో ఉత్తమ సేవ లందించిన వారిని ఎంపిక చేసి దీనికి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి మొత్తం 10 మంది ఎంపికయ్యారు. గ్రామ పంచాయతీ కార్మిక విభాగంలో లక్ష్మణ్ చోటు దక్కించుకోవం విశేషం. కేంద్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం మేరకు మంగళవారం దిల్లీకి బయల్దేరారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

గుడి కట్టి.. అభిమానం చాటి..



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామస్థులు మహాత్ముడికి ఆలయం నిర్మించి పూజిస్తుండటం విశేషం. ఐదు దశాబ్దాల క్రితం జాతిపిత ప్రతిమ ఏర్పాటు చేశారు. ఆలయాల్లో మాదిరిగా మహాత్ముడి విగ్రహం ఎదుట నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, మొహర్రం వంటి పండగల వేళ గాంధీజీకి పూజలు చేసి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. 1995లో దివంగత ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, అప్పటి సర్పంచి పీకే పాటిల్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేశారు. మహాత్ముడికి జయంతి, స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలను ఇక్కడే చేపడతారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

1973లో నెలకొల్పి..




మహాత్ముడు చూపిన బాటలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో గాంధీ విగ్రహం నెలకొల్పి పూజిస్తుండటం విశేషం. 1973లో అప్పటి సర్పంచి వెంకట్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డిలు కలిసి ప్రతిమ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్థానికుడు మహాలింగం ప్రతి శుక్రవారం పూజలు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చిన్న కుమారుడు అడివయ్య స్వామి కొనసాగిస్తున్నారు. గాంధీ జయంతి రోజున ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం చేసి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం గ్రామ సభ నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొండాపూర్

అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ ఆరా

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో జరిగిన అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆరా తీశారు. ఈ మేరకు గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్ నాగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట సీపీ అనూరాధతో గవర్నర్ మాట్లాడి.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలికకు పునరావాసం కల్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



అంజిలయ్య

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు, ఎస్సై రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం అంజిలయ్య (34) రోజు మాదిరిగానే ఉదయం వరిపొలం చూసేందుకు వెళ్లాడు. పొలానికి చుట్టిన తీగపై విద్యుత్తు తీగ పడి ఉండటం గమనించకుండా వెల్లడంతో విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సంగెం లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..



నర్సింలు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు(28) శివారులోని సామిల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన చరవాణిలో మాట్లాడుకుంటూ సామిల్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నియంత్రిక ఎర్తింగ్ తీగకు కాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: వెనుకనుంచి వచ్చిన వాహనం ఢీకొని చిరువ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ములుగు మండలం తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పూసల కృష్ణ (50) ద్విచక్ర వాహనంపై అప్పడాలు, మసాలాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిర్మాపూర్ గ్రామం నుంచి వెళుతుండగా వెనుకనించి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎగిరి రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. అతడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాచరణ.. విజ్ఞాన బాట

ప్రణాళికతో సెలవుల్లో వెలుగులు

సమయం వెలకట్టలేనిది. ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. విద్యాసంస్థలకు నేటి నుంచి ఈ నెల 14 వరకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించిన విషయం విదితమే. 13 రోజుల పాటు ఇచ్చిన పండగ సెలవులను వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్

సిద్దిపేట ● | మెదక్ ● | సంగారెడ్డి ● | వికారాబాద్ ●

ఫోన్లకు దూరం సుమా..



విద్యాసంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్, సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికితే స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొందరు గంటల కొద్ది చూస్తుంటారు. వారిని కాస్త కట్టడి చేయాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చాలి.

జిల్లాల వారీగా విద్యార్థులు (లక్షల్లో)

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
1.74	1.09	2.79	1.20

చెంతనే పర్యాటకం..



కొందరు దర్శనీయ ప్రాంతాలకు సుదూరం వెళ్తుంటారు. కాస్త ఉపాయంగా ఆలోచిస్తే చెంతనే పర్యాటక ప్రదేశాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కోమటిచెరువు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, నాగులబండ వద్ద అర్బన్ ఫారెస్టు, మెదక్‌లో ప్రఖ్యాత చర్చి, గోల్‌బంగ్లా, సంగారెడ్డి జిల్లాలో మంజీర నది, మ్యూజియం, వికారాబాద్‌లో అనంతగిరి అడవులు ప్రత్యేకం. ఆయాచోట్లకు వెళ్తే వినోదం, విజ్ఞానం పంచేందుకు దోహదం చేసినట్లే.

పర్యాటకులు ఇలా..

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
10,000	4,500	3,100	2000

గౌరవం పెంచుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానం అలవర్చాలి. ఊర్లకు పంపిస్తారు కనుక పెద్దలను గౌరవించడం నేర్పించాలి. రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. కలిసి భోజనం చేయడం, సరదాగా, స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ.. హిత వచనాలు వల్లెవేయాలి.

ప్రోత్సాహంతో ఉత్సాహం..



పిల్లలకు ఆసక్తి ఉన్న ఆటపాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం, ఇతర అంశాలనే నేర్చుకునే అవకాశం కల్పించవచ్చు. ఫలితంగా పట్టు సాధించవచ్చు.

పుస్తకం వైపు మరలేలా..




మారుతున్న పరిస్థితుల్లో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతోమంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. ఈ క్రమంలో ప్రతి జిల్లాలో చెంతనే ఉండే విజ్ఞాన భాండాగారాలను వినియోగించుకోవచ్చు. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి.

గ్రంథాలయాలు

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
21	16	33	20

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా పెద్ద అంతా కలిసి ఉండే వారు. సెలవుల్లో అమ్మమ్మ, నాయనమ్మ ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదునుగా సెలవులను సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండగ విశిష్టతను తెలియజేయాలి.

జిల్లాల వారీగా కుటుంబాలు (లక్షల్లో)

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
2.38	2.14	3.29	1.98

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రాములు, పీఈటీ అనిల్‌కుమార్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాములు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14, 17 సహా ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్ అండర్-17 విభాగాల్లో విద్యార్థులు రాహుల్, మల్లేశం, అర్మాన్, అఖిల్, మునీర్, షాహిద్ ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ గౌడ్, పీఈటీ అనిల్‌కుమార్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

సదాశివపేట, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సేషన్ న్యాయమూర్తి భవానీ చంద్ర మంగళవారం తీర్పు వెలువరించారని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. 'వికారాబాద్ జిల్లా జాంబపూర్ తండాకు చెందిన కాట్రోత్ రవినాయక్ తన మొదటి భార్య చనిపోవడంతో రెండవ భార్యతో కలిసి సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నివాసం ఉంటున్నారు. మొదటి భార్య కూతురు రేణుక వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కస్తూర్బాలో 8వ తరగతి చదువుతోంది. 2020 సంవత్సరంలో కూతురు ఆరోగ్యం బాగా లేదని చికిత్స నిమిత్తం పాఠశాల నుంచి సదాశివపేటకు తీసుకొచ్చాడు. తిరిగి పాఠశాలకు తీసుకెళ్లేటప్పుడు మార్గమధ్యలో గొంతు నులిపి చంపేసి జ్వరంతో చనిపోయిందని అందరిని నమ్మించాడు. అనుమానం వచ్చి అప్పటి వీఆర్వో పోలీసులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని' సీఐ వివరించారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 110–00	డ్రెస్డ్ 191–00	
రిటైల్ 132–00	స్కిన్‌లెస్ 218–00	

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



నర్సింలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మద్యం మత్తులో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామ పంచాయతీ పాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాదే నర్సింలు(35), మౌనిక దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. భార్య ఎనిమిది నెలల క్రితం కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన నర్సింలు మద్యం మత్తులో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు వచ్చి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. నర్సింలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోసం చేసిన స్థిరాస్తి సంస్థ

సాయిసూర్య డెవలపర్స్ ఎండీపై కేసు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడితో ప్రచారం చేయించి, భారీ వెంచర్లు ప్రారంభిస్తున్నామని ఆర్భాటం చేసిన హైదరాబాద్‌లోని సాయిసూర్య డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3.63 కోట్లు వసూలు చేసి వినియోగదారుడిని మోసగించింది. నగర శివారులోని మన్నాన్‌పల్లిలో నేచర్ కౌంటీ పేరుతో మొదలుపెట్టిన ప్రాజెక్టులో ప్లాట్లు రిజిస్టర్ చేయిస్తామంటూ నమ్మించి వంచించింది. మంగళవారం బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జూబ్లీహిల్స్‌కు చెందిన అచ్యుతసింగ్ నైజీరియాలో వ్యాపారం చేస్తున్నాడు. సాయి సూర్య డెవలపర్స్ సంస్థ ప్రాజెక్టుల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఆకర్షితుడయ్యాడు. 2021 నవంబరులో సంస్థ ఏజెంట్ కరీమ్‌ను సంప్రదించగా, హైదరాబాద్ శివారు, వికారాబాద్‌లో ప్రాజెక్టులు ప్రారంభిస్తోందని వివరించాడు. అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఎండీ సతీశ్ చంద్ర గుప్తాను కలిశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మాన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు ఎండీ వివరించాడు. తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అచ్యుతసింగ్ సర్వే నం.32లో 1230, 900 చదరపు గజాల చొప్పున రెండు స్థలాలను రూ.3.63 కోట్లకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. 2022 జనవరి తొలివారంలో రిజిస్ట్రేషన్‌కు అంగీకారం కుదుర్చుకున్నారు. గడువులోగా రిజిస్టర్ చేయిస్తామని చెప్పడంతో అచ్యుతసింగ్ మొత్తం నగదు చెల్లించాడు. 2022 జనవరి 7న రిజిస్ట్రేషన్ చేయిస్తానని సతీశ్‌చంద్ర చెప్పడంతో అచ్యుతసింగ్, ఆయన కూతురు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. సతీశ్ రాకపోవడంతో అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లగా, సతీశ్ చంద్ర నెల్లూరు వెళ్లినట్లు సిబ్బంది చెప్పారు. సతీశ్ చంద్ర కాలయాపన చేయడంతో, బాధితుడు సంస్థ గురించి ఆరా తీయగా మరింత మందిని మోసం చేశారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. సతీశ్‌చంద్ర, కరీమ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వివరించారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

ఇంటర్ విద్య ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం: ఉజ్వల భవిష్యత్తుకు ఇంటర్ విద్య కీలకమైనదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిన్నారం ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన స్వాగతోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ కృష్ణకుమార్, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ పాల్గొన్నారు.

'పూరిళ్లు తొలగించొద్దు'

సంగారెడ్డి మున్సిపాలిటీ: చెరువులు, నాలాలపేరుతో పేదల పూరిళ్లు ధ్వంసం చేయవద్దని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ అశోక్, మహేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వినోద పాల్గొన్నారు.

పేదలకు సరకుల పంపిణీ

జహీరాబాద్: దసరా పండగను పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని పేదలకు 'సద్భావన్ మంచ్' స్వచ్ఛంద సంస్థ, 'వేంకటేశ్వర షాపింగ్ మాల్' ఆధ్వర్యంలో ఆదర్శనగర్ పార్కులో నిత్యావసర వస్తువులు, దుస్తులను పంపిణీ చేశారు. 'సద్భావన్ మంచ్' సంస్థ ప్రతినిధులు సంగప్ప, అబ్దుల్‌జబ్బార్, వెంకటేశ్వర షాపింగ్‌మాల్ వ్యవస్థాపకుడు వేంకటేశం, ఆదర్శనగర్ కాలనీ కమిటీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, శంకర్‌పాటిల్ పాల్గొన్నారు.

కొత్త పంచాయతీలపై నిర్లక్ష్యం

నిధులున్నా ప్రారంభించని నిర్మాణాలు

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే:

గిరిజన పంచాయతీల్లో భవన నిర్మాణాలకు గ్రహణం వీడలేదు. నిధులున్నా నిర్మాణాలు చేపట్టడం లేదు. ఇరుకు గదుల్లో పాలన సాగిస్తున్నారు. భవనాల్లో కనీసం కూర్చోవడానికి స్థలం లేదు. కొన్ని ప్రాంతాల్లో పంచాయతీ కార్యాలయం, పాఠశాల తరగతులు ఒకేచోట కొనసాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దస్త్రాలు దాచుకోవడానికి అధికారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఇదీ సంగతి: జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉంటే అందులో వంద శాతం గిరిజనులు ఉండే పంచాయతీలు 75 ఉన్నాయి. ఇవీ కొత్తగా ఏర్పాటు చేయడంతో సమావేశాలు, పంచాయతీల పాలనకు భవనాలు లేవు. దీంతో అద్దె భవనాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సర్పంచుల వినతి మేరకు ప్రభుత్వం 2023 సంవత్సరంలో గిరిజన పంచాయతీల భవనాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.20 లక్షలు కేటాయించింది. అప్పట్లో భూమిపూజ చేసి వదిలేశారు. ఇప్పటికీ ఆ నిర్మాణాలు చేపట్టకపోవడం గమనార్హం.



శిథిల భవనంలో కొనసాగుతున్న కొండనాయక్‌తండా పంచాయతీ కార్యాలయం

పనులు ప్రారంభించేలా చర్యలు..

తండాల్లో పంచాయతీ భవనాల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కొత్తగా ఏర్పడిన తండా పంచాయతీలన్నింటికి భవనాలు మంజూరయ్యాయి. భూమిపూజ కూడా పూర్తయింది. గుత్తేదారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. –ప్రసాద్, పీఆర్ డిప్యూటీ ఈఈ.

ఇరుకు గదులతో

తండాలు స్వయం పాలనా కేంద్రాలుగా మారడంతో అనేక సేవలు స్థానిక గిరిజనులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి పంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, కంపోస్ట్ షెడ్లు, డంపింగ్ యార్డు, నర్సరీలు ఏర్పాటయ్యాయి. వీటితో తండాల రూపురేఖలు మారాయి. అయితే పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో పరిపాలన పరంగా ఇక్కట్లు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లోని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. రికార్డులకు భద్రత కరవైంది. పాలకవర్గం సమావేశాలకు, గ్రామ సభల నిర్వహణకు ఇబ్బందికరంగా మారింది. పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయితేనే రానున్న రోజుల్లో కొలువు తీరనున్న పాలకవర్గాలతోపాటు ఉద్యోగులకు ఇబ్బందులు తప్పుతాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

పోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

? సంగారెడ్డి పట్టణం వీరభద్రనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. వర్షానికి బల్బులు పాడవుతున్నాయి. అధికారులు స్పందించి కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయించాలి. – **జగదీశ్వర్, సంగారెడ్డి.**

✓ వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. – **ఇంతియాజ్ అహ్మద్, డీఈఈ.**

? సంగారెడ్డిలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై చెత్తాచెదారం వేస్తున్నారు. చెత్త చెరువులోకి వెళ్లి కలుషితం అవుతోంది. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి. – **మాణిక్యరెడ్డి, సంగారెడ్డి.**

✓ వెంటనే సిబ్బందిని పంపి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – **సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సంగారెడ్డి.**

? అల్మాయిపేట ప్రధాన దారి వర్షాలతో గుంతలు పడింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –**మల్లేశం, అల్మాయిపేట.**

✓ మరమ్మతులు చేయిస్తాం. –**రవీందర్, డిప్యూటీ, అందోలు.**

? జోగిపేట అగ్నిమాపక కేంద్రం పక్కన ఐమాస్టు దీపాలు వెలుగడం లేదు. దీంతో రాత్రి సమయంలో వెళుతున్న బృందావన, మల్లన్న కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **-అశోక్, జోగిపేట.**

సమాధానం: కాలిపోయిన దీపాలు తొలగించి కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. **- తిరుపతి, కమీషనర్ అందోలు- జోగిపేట.**

దారుల నిర్మాణంతో సమస్య పరిష్కారం

జిన్నారం: ఐడీఏ బొల్లారం పట్టణ పరిధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి పేర్కొన్నారు. సోమవారం ఐడీఏ బొల్లారం పట్టణంలోని 19, 21 వార్డులో రూ.1.14 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పనుల్లో నాణ్యత, వేగం పెంచాలన్నారు మాజీ జడ్పీటీసీ కె. బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సంధ్యజైపాల్‌రెడ్డి, జయమ్మ, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభంలో పుర అధ్యక్షురాలు రోజారాణి తదితరులు

స్వచ్ఛత కార్యక్రమాలు

జహీరాబాద్ అర్బన్, గుమ్మడిదల, న్యూస్‌టుడే: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో మేనేజర్ మాధవ్‌కృష్ణ, జియో ఫౌండేషన్ ప్రతినిధులు ప్లాట్‌ఫామ్, రైల్వే ట్రాక్ శుభ్రం చేశారు. ● దోమడుగు పుల్లారెడ్డి ఫార్మా కళాశాల విద్యార్థులు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

తాత్కాలిక మరమ్మతులు

ఈనాడు కథనాలకు స్పందన

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గుంతల్లో చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈనెల 1న 'జాతీయ రహదారి.. గుంతలున్నాయి మరి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. మంగళవారం తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. రవాణా సాఫీగా సాగుతుందని పలువురు చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ బస్తీలో పరిశుభ్రం

గుమ్మడిదల, న్యూస్‌టుడే: 'పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం' అనే శీర్షికన ఈనెల 1న 'ఈనాడు' లో వచ్చిన కథనానికి గుమ్మడిదల మండల అధికారులు స్పందించారు. మంగళవారం గుమ్మడిదల ఎంపీడీఓ ఉమాదేవి బొంతపల్లి ఎస్సీ బస్తీలో మురుగు కాలువలను పరిశీలించి శుభ్రత చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి నారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



మాచునూర్ పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలు అందంగా పేర్చి వాటి చుట్టూ ఆడిపాడారు. తర్వాత కొన్ని ప్రాంతాల్లో బకెట్లల్లో నీళ్లు పోసి నిమజ్జనం చేయగా...మరికొన్ని ప్రాంతాల్లో బతుకమ్మలను చెరువులు, కుంటల వద్దకు తరలించారు. – న్యూస్‌టుడే బృందం.



సదాశివపేటలో కమిషనర్ ఉమ తదితరులు...



జోగిపేట చెరువు వద్ద...



నారాయణఖేడ్‌లో జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో...



చెట్లపోతారంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు...

రైతులందరికి రుణమాఫీ చేయాలి

సదాశివపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహరెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డిలో నిర్వహించే రైతు సభకు తరలిరావాలని ఆత్మకూర్, పొట్టిపల్లి, నందికంది, కోల్కూర్, నిజాంపూర్‌లలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘం నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లన్న పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణకు ఎమ్మెల్యే హామీ

కల్హేర్: బాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల పంపిణీకి సహకారం అందజేయనున్నట్లు నారాయఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం హామీ ఇచ్చారు. బాచేపల్లి పాఠశాలలో విద్యార్థులు కంప్యూటర్లు లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి 'బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో సమకూర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిగారి శ్రీకాంత్, హెచ్ఎం రాజేందర్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

ఝరాసంగం, న్యూస్‌టుడే: గ్రామంలోని భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని తహసీల్దార్ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం బిడకన్నెకు రెవెన్యూ, సర్వే సిబ్బంది చేరుకుని గ్రామస్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డీఐఓ భిక్షపతి, ఆర్ఐ రామారావు, సర్వేయర్లు నరసింహులు, లాల్‌సింగ్, సుధాకర్‌రెడ్డి, శశికాంత్ మాజీ ఎంపీపీ దేవదాస్, డీలర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేబిస్ నియంత్రణపై అవగాహన

జహీరాబాద్: జహీరాబాద్ పురపాలక కార్యాలయంలో మంగళవారం డీడీఎస్- కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు రేబిస్ నియంత్రణపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కైలాస్ వివిధ మెలకువలు తెలిపారు. పురపాలక సంఘం పర్యావరణాధికారి రాజ్‌కుమార్, సివిల్ సర్జన్ సాయికిరణ్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సంగారెడ్డి అర్బన్, నారాయణఖేడ్: సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ● దవాఖానా ఖర్చుల నిమిత్తం కంగ్టికి చెందిన మదన్‌గోపాల్‌కు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.50 వేల ఆర్థిక సాయం చెక్కును మంగళవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి వీరికి అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకంపై ఆరా

జోగిపేట, న్యూస్‌టుడే: అందోలు మండల పరిధిలోని పోసానిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా అదనపు శిక్షణ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీయగా అసంపూర్తి గదులతో పడుతున్న ఇబ్బందులను వివరించారు. అనంతరం అక్కడ నిర్వహించిన బతుకమ్మ పండగ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేష్‌కుమార్ ఉన్నారు.

గుడ్లు, పండ్లు పంపిణీ

హత్నూర, న్యూస్‌టుడే: వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్తీపూర్‌లో వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, గుడ్లు పంపిణీ చేశారు.

ఏఈవోలపై పనిభారం తగ్గించాలి

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: వ్యవసాయ విస్తరణ అధికారులపై ప్రభుత్వం పనిభారం తగ్గించాలని ఏఈవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. జహీరాబాద్ మండలం రంజోల్ రైతు వేదిక ఎదుట మంగళవారం డివిజన్‌లోని విస్తరణ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. 'డిజిటల్ క్రాప్ బుకింగ్' అమలు వల్ల వ్యవసాయ విస్తరణ అధికారులపై మరింత పనిభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డివిజన్‌లోని ఏఈవోలు ప్రవీణ్ కుమార్, రాజు, వీరేందర్, మనోహర్, స్రవంతి, శివప్రియ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

సిర్గాపూర్: బొక్కస్‌గాం ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి యోగేశ్వర్ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు సాధించడం తమకు ఆనందాన్ని కలిగించిందని హెచ్ఎం నర్సింగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, షాదుల్, ప్రవీణ్, గ్రామస్థులు జైరాజ్, బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యోగేశ్వర్‌ను సత్కరించారు.



యోగేశ్వర్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, సిబ్బంది

కల్హేర్‌లో ఉద్రిక్తత... ఇరువర్గాలపై కేసులు

కల్హేర్: వివాహితను చరవాణిలో ఫొటోలు తీసి వేధింపులకు గురిచేసిన ఘటనతో సంబంధం ఉన్న వ్యక్తిపై... సదరు వ్యక్తిని కొందరు కారులో బలవంతంగా నిజాంసాగర్ పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లి వదిలేసిన ఘటనలో వచ్చిన ఫిర్యాదులతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్సై వెంకటేశం తెలిపారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకోగా మంగళవారం ఉదయం కల్హేర్‌లో ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్నాయి. కల్హేర్ పోలీసులు నారాయణఖేడ్, సిర్గాపూర్, కంగ్టి ఎస్సైలు, కంగ్టి సీఐ, సిబ్బంది గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఇరు వర్గాల పెద్దమనుషులతో సమావేశాలు నిర్వహించి సంయమనం పాటించాలని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది.

నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

గుమ్మడిదల, నారాయణఖేడ్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం ముస్తాబైంది. ఆలయంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారు నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు. ● ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీమాత ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

వరిలో తెగులు నివారణకు చర్యలు

కల్హేర్: బాచేపల్లిలో వరి పైరుకు సోకుతున్న కంకినల్లి తెగులు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని ఖేడ్ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. కంకినల్లి నివారణకు స్పైరోమిసిన్ రెండు మిల్లీలీటర్ల ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ బాస్కర్, వంశీ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో భారీ వర్షం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. కొద్దిసేపు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దారుల్లో నీళ్లు చేరాయి.

పారిశుద్ధ్య కార్మికులతో సహపంక్తి భోజనం

నారాయణఖేడ్: ఖేడ్ పురపాలక సంఘానికి సంబంధించిన చెత్తదిబ్బ వద్ద స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం శుభ్రత పనుల్లో భాగంగా ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించారు. అనంతరం అక్కడికి సమీపంలోని ప్రకృతి వనంలో కమిషనర్ జగ్జీవన్, పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వార్డుల అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు

జహీరాబాద్: సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని రోటరీ క్లబ్ తెలంగాణ టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ లింగాగౌడ్ పేర్కొన్నారు. జహీరాబాద్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యక్షుడిగా ఎన్.లాల్‌రెడ్డి, కార్యదర్శిగా రఘునందన్‌రెడ్డి, కోశాధికారిగా రుద్రప్పపాటిల్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గోవింద్‌అగర్వాల్, మాజీ అసిస్టెంట్ గవర్నర్లు మహిపాల్‌రెడ్డి, సంగ్రామ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు సంగ్రామ్ పాటిల్, వెంకటేశం పాల్గొన్నారు.



కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న లింగాగౌడ్

సంఘాలు ఎన్నికలు..

యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

బొంతపల్లి (గుమ్మడిదల): గుమ్మడిదల మండల టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గాన్ని మంగళవారం బొంతపలి పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా వినోద్‌కుమార్(నాగిరెడ్డిగూడెం), ఉపాధ్యక్షులుగా విజేతకుమారి, బాబురావు, అంజయ్య, పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అబ్దుల్లా(బొంతపల్లి), కోశాధికారిగా భాస్కర్‌రావు(బొంతపల్లి), కార్యదర్శులుగా చంద్రకళ, హస్సేన్, అజీమున్నిసా, జులియమ్మ, ఏసుపాదం, అప్పిరెడ్డి, జానకి, పద్మ, విశాలక్ష్మీలు ఎన్నికయ్యారు. గుమ్మడిదల పాఠశాల సముదాయ కమిటీ అధ్యక్షురాలిగా జీవనజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా పరిమళ, కార్యదర్శిగా ధనలక్ష్మి, బొంతపల్లి పాఠశాల సముదాయ కమిటీ అధ్యక్షురాలిగా ఊర్మిళ, ప్రధాన కార్యదర్శిగా పోతన జ్యోతి, కార్యదర్శిగా శారదలతో కమిటీలు ఏకగ్రీవమైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ తెలిపారు.



ఎన్నికైన యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు వీరే

కల్హేర్ పీఆర్టీయూ సంఘం...

కల్హేర్: కల్హేర్ మండల పీఆర్టీయూ సంఘం అధ్యక్షులుగా రామోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గుండు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా సంజీవ్‌కుమార్, కార్యదర్శిగా హన్మంతు, భార్గవ్, మహిళా ఉపాధ్యక్షురాలి స్నేహ ఎన్నికయ్యారు. పీఆర్టీయూ కార్యవర్గ సభ్యులను కల్హేర్ జడ్పీ హెచ్ఎం, ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.